మహా యజ్ఞంలో ఎమ్మెల్యేలు



లంగర్‌హౌస్: త్రివేణి సంగం ఒడ్డున వెలసిన చారిత్రాత్మక మఠ ఆలయం జానకీ సమేత వీర వెంకట విజయరాఘవ స్వామి ఆలయంలో 18 నెలల పాటు తలపెట్టిన శ్రీరాముడి అఖండ మహాయజ్ఞం కొనసాగుతున్నది. ఇందులో భాగంగా పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో పౌర్ణమి రోజు రాత్రి సుదర్శన హోమం నిర్వహించారు. పరిగి, నారాయణ్‌ఖేడ్ ఎమ్మెల్యేలు రాంమోహన్ రెడ్డి, సంజీవ్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

'కోట' కిటకిట



గోల్కొండ: గోల్కొండ కోటలో పర్యాటకుల సందడి నెలకొన్నది. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోటలోకి ప్రవేశించగానే క్లాపింగ్ పోర్టికో వద్ద ఉన్న భారీ ఫిరంగి వద్ద ఫొటోలు దిగారు. మరోవైపు నగీనాబాగ్‌లో ఉన్న భారీ ఇనుప ముద్దతో యువకులు ఆటలు ఆడుకున్నారు. అలాగే రాణి మహల్, దర్బార్ హాల్, అక్కన్న, మాదన్న కార్యాలయం, ఆయుధాగారం తదితర ప్రాంతాలను ఆసక్తిగా తిలకించారు.

అల్లూరి సీతారామరాజు అవార్డుల ప్రదానం



అవార్డుతో కుటుంబ రాజు

గన్‌ఫౌండ్రీ: హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటక్షన్ సర్వీస్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఆదివారం పలువురికి అల్లూరి సీతారామరాజు స్మారక స్ఫూర్తి అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత మాట్లాడుతూ.. మహనీయుల స్ఫూర్తిని నేటితరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అలాగూ స్వతంత్ర సమరయోధుల చరిత్ర ప్రతి గ్రామపంచాయతీల్లో ఉండేలా చూడాలన్నారు. అంతకుముందు ఉయ్యూర్ లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు సి.వీరవెంకట కుటుంబ రాజుకు పురస్కారం అందజేశారు.

కఠోర శ్రమతోనే మంచి ఫలితాలు



తల్లిదండ్రులతో అంబటి హాసిని

గోల్కొండ: కఠోర శిక్షణ, క్రమ శిక్షణతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కార్వాన్‌కు చెందిన అంబటి హాసిని నిరూపించింది. సరూర్‌నగర్‌లో ఆదివారం జరిగిన ఖేలో ఇండియా అస్మిత లీగ్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో ఆమె పాల్గొని బంగారు పతకం సాధించింది. సాయంత్రం గుడిమల్కాపూర్‌లోని తన స్వగృహంలో ఆమె తల్లిదండ్రులు అంబటి రవీందర్, అంబికతో కలిసి సంబరాలు చేసుకున్నది. తైక్వాండో కోచ్ సురేందర్‌సింగ్ ఠాకూర్ శిక్షణలో రాష్ట్రస్థాయి పతకాలు సాధించానని ఆమె తెలిపారు.

ముగిసిన ఆలిండియా ఆర్పీఎఫ్ అథ్లెటిక్స్ పోటీలు

అడ్డగుట్ట: సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ గ్రౌండ్‌లో కొనసాగుతున్న ఆలిండియా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ 32వ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. 17 జోన్ల రైల్వేల నుంచి వచ్చిన 232 మంది క్రీడాకారులు వివిధ పోటీల్లో పాల్గొని సత్తాచాటారు. ముఖ్య అతిథిగా దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాత్సవ హాజరై మాట్లాడుతూ.. ఏటా నిర్వహించే ఆర్పీఎఫ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల ద్వారా క్రీడాకారుల్లోని నైపుణ్యం, సంకల్పం, క్రీడాస్ఫూర్తి వెలువడుతాయన్నారు. సదరన్ రైల్వే మొదటి స్థానంలో నిలవగా, ఈస్టర్న్ రైల్వే రెండో స్థానం, దక్షిణ మధ్య రైల్వే మూడో స్థానంలో నిలిచాయి. ప్రతిభ చూపిన వారిలో బెస్ట్ మేల్ అథ్లెట్‌గా సదరన్ రైల్వేకు చెందిన ఎన్. సెంథిల్‌కుమార్, బెస్ట్ ఫీమేల్ అథ్లెట్‌గా దక్షిణ మధ్య రైల్వేకు చెందిన శుభ శ్రీలకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డీఆర్ఎం గోపాలకృష్ణన్, హైదరాబాద్ డీఆర్ఎం లోకేష్ విష్ణోయ్, ఆర్పీఎఫ్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరదలోనే ఇళ్లు

డబీర్‌పురా: ఫర్హత్‌నగర్ ప్రాంతం పార్థీవాడలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఓ పురాతన ఇంటి గోడ కూలింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ విషయం తెలుసుకున్న మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అక్కడికి చేరుకుని పరిశీలించారు. తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పురాతన ఇళ్లల్లో ఉంటున్న వారు జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.

ఆలయంలోకి వరద

ఫర్హత్‌నగర్ ప్రాంతంలోని ఫిలక్‌మాత ఆలయం, అలాగే పలువురి ఇళ్లలోకి వరద చేరింది.

ఇళ్లల్లోకి వరద

అబిడ్స్: ఎంజే మార్కెట్, ఉస్మాన్‌గంజ్, మహారాజ్‌గంజ్, ముక్తార్‌గంజ్, రిసాలాబ్దుల్లా ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎంజే మార్కెట్ పరిధిలోని నందిని కాంప్లెక్స్ సెల్లార్ మొత్తం వర్షం నీరు నిండిపోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్ గౌడ్, గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శాంతి దేవి, ప్రేమ్ అగర్వాల్, స్థానిక నాయకులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు.



కూలిన ప్రహరీని పరిశీలిస్తున్న మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా



ఫిలక్‌మాత ఆలయంలోకి చేరిన వరద



పార్థీవాడలో కూలిన ప్రహరీ ..



నందిని కాంప్లెక్స్ వద్ద సహాయక చర్యలు చేపట్టిన బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్ గౌడ్ తదితరులు



నందిని కాంప్లెక్స్‌లోకి చేరిన నీరు

ఘనంగా ఆంగ్ల అధ్యాపకుల సంఘం వార్షికోత్సవం



ఆంగ్ల కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ విజయ్ కుమార్

చార్మినార్: ప్రభుత్వ సిటీ కాలేజీ ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో ఆంగ్ల అధ్యాపకుల సంఘం హైదరాబాద్ సెంట్రల్ చాప్టర్ మొదటి వార్షికోత్సవ వేడుకలు ఆదివారం కాలేజీ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ప్రముఖ విద్యావేత్త, బిట్స్ పిలానీ హైదరాబాద్‌లో ఆచార్యులుగా ఉన్న ప్రొఫెసర్ టి.విజయ్ కుమార్ హాజరై మాట్లాడుతూ.. 'సాహిత్యం, భాష పరస్పర ఆధారపడ్డవేననీ..భాష లేకుండా సాహిత్యం ఉండదు, సాహిత్యం లేకుండా భాష బోధన సంపూర్ణం కాదన్నారు. సంఘం కన్వీనర్ డా. కృష్ణ చంద్ర కీర్తి, కో-కన్వీనర్ డా. పి. సన్యాసి రావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు అతిథులను, పాల్గొన్న వారిని ఆహ్వానించారు. ఉదయం సెషన్లో 'పారగాన్ ఆఫ్ పర్ణసస్ అనే కవితా సంకలనం ఆవిష్కరించి మధ్యాహ్నం సెషన్లో ఆ సంకలనంలో తమ కవితలను ప్రచురించిన కవులు కవిత పఠనం చేసి శ్రోతలను అలరించారు. హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అధ్యాపకుల వృత్తిపరమైన అభివృద్ధి, సృజనాత్మక వ్యక్తీకరణను ప్రోత్సహించాలనే సంకల్పంతో నిర్వహించామని సంఘం బాధ్యుడు డా.కృష్ణచంద్ర కీర్తి తెలిపారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు అని సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనురాధ అన్నారు. కోఠిఆసుపత్రి ప్రాంగణంలో గల బంగారు మైసమ్మ అమ్మవారికి సిబ్బంది, ఉద్యోగులు, వైద్యులు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనురాధ అష్టోత్తర స్తోత్రంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఉద్యోగులు బాలరాజు, వినోద్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ సేవా కేంద్రం సేవలు ఎనలేనివి

ఖైరతాబాద్: వాసవీ సేవా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తూరు సీతయ్య గుప్తా 114వ జయంతి వేడుకలను ఆదివారం ఖైరతాబాద్‌లోని వాసవీ సేవాకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 500 వందల మంది పేదలకు పెన్షన్లు, 125 మందికి 10కిలోల బియ్యం, సైకిళ్లు, గ్రైండర్లు, కుట్టు మెషిన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడారు. కొత్తూరు సీతయ్య గుప్తా దూరదృష్టితో ఏర్పాటు చేసిన సేవా కేంద్రం ఎంతో మందికి ఉపాధి కల్పిస్తోందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో 52 సంవత్సరాలుగా చేస్తున్న సేవలను అభినందించారు. కొండ్లె మల్లికార్జున్ నేతృత్వంలో తిరుపతిలో ప్రారంభించే సేవాకార్యక్రమాలకు తనవంతు సహకారం ఉంటుందని టీజీ వెంకటేష్ తెలిపారు.

- ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ మాట్లాడుతూ... సేవా కేంద్రం చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రతి సంవత్సరం విస్తరించుకుంటూ పోవడం అభినందనీయమన్నారు. స్వయం ఉపాధి కింద 81 కుట్టు మెషిన్లను స్పాన్సర్ చేసిన సీల్‌వెల్ కార్పొరేషన్ అధినేత బండారు సుబ్బారావు మాట్లాడుతూ.. సమాజం కోసం చేసే ప్రతి కార్యక్రమంలో తన వంతు సహకారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన మందులు ఉచితంగా అందజేశారు. వాసవీ సేవాకేంద్రం అధ్యక్షుడు కోల్పూరు రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు చీకట్ మర్ల అశోక్ కుమార్, కొండ్లె మల్లికార్జున్, ఆలంపల్లి రవికుమార్, కాసనగొట్టు రాజశేఖర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి నాచం ప్రభాకర్, కోశాధికారి ఇల్లూరి నరేంద్ర కుమార్, కన్వీనర్ రాజేష్ కోలావర్, కూర జయరాములు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు భారీ బందోబస్తు

బంజారాహిల్స్: బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్, టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్, ప్రముఖ బాలీవుడ నటి కియారా అద్వానీ నటించిన వార్-2 సినిమా ప్రీ రిలీజ్ వేడుకలు ఆదివారం సాయంత్రం యూసుఫ్‌గూడ బెటాలియన్‌లోని కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగాయి. వీరితో పాటు ప్రముఖ నిర్మాత ఆదిత్య చోప్రా, సినిమా డైరెక్టర్ అయాన్ ముఖర్జీ కూడా ఈ వేడుకకు హాజరయ్యారు. ఈ వేడుకలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తొక్కిసలాట జరగకుండా జూబ్లీహిల్స్ పోలీసులు, వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. గత మూడు రోజుల నుంచి ఈ బందోబస్తుకు సంబంధించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. బందోబస్తులో భాగంగా 300 మంది బౌన్సర్లను నియమించారు. చుట్టూ 60 కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆరు మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేశారు. ఫైర్ స్టేషన్ ఆఫీసర్‌తో పాటు సిబ్బంది కూడా విధుల్లో ఉన్నారు. వీరికి తోడు అయిదు ఉమెన్ ప్లటూన్లు, తొమ్మిది మన్ ప్లటూన్లతో పాటు సిటీ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కూడా బందోబస్తులో పాల్పంచుకున్నాయి. ట్రాఫిక్ ఇబ్బదులు తలెత్తకుండా వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరి ప్రసాద్ ఉదయం నుంచే ఇక్కడ పరిస్థితిని పర్యవేక్షించారు. అర్ధరాత్రి దాకా పోలీసులు ఇక్కడే ఉండి అభిమానులు వెళ్లే దాకా పరిస్థితులను సమీక్షించారు.



ఐటీఐలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

విజయనగర్‌కాలనీ: ఐటీఐలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు శాంతినగర్ ఐటీఐ ప్రిన్సిపాల్ పసుపులేటి శ్రీనివాసరావు, సనత్‌నగర్, ఖైరతాబాద్ ప్రిన్సిపాల్స్ ఆర్.శ్రీనివాసరావు, కె.వేమారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ధ్రువీకరణ పత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో నేరుగా ఈనెల 28 లోగా హాజరు కావాలని పేర్కొన్నారు. దరఖాస్తులను iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసుకోవాలన్నారు.

'కాంగ్రెస్ గెలుపు ఖాయం'

గోల్కొండ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందడం ఖాయమని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. టోలిచౌకి చౌరస్తా వద్ద సీనియర్ కాంగ్రెస్ నాయకులు బూత్ కన్వీనర్లతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరును ప్రజలంతా మెచ్చుకుంటున్నారన్నారు. మన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అభ్యర్థి ఎవరైనా ఐక్యంగా ఉండి భారీ మెజార్టీతో గెలుపొందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో షేక్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు సత్యనారాయణ, అఫ్రోజ్, గౌస్ ఉన్నారు.

మాజీ రాష్ట్రపతికి ఘన నివాళి



నివాళులర్పించిన మనీలాల్‌షా తదితరులు

అబిడ్స్: గాంధీభవన్‌లో దివంగత మాజీ రాష్ట్రపతి వివి గిరి జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టీపీసీసీ కార్యదర్శి మనీలాల్ షా, మాజీ ఎమ్మెల్సీ కమలాకర్‌రావు, శ్యామ్‌మోహన్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

దాడిచేసిన నలుగురిపై కేసు

వెంగళరావునగర్: కార్యాలయంలో దొంగతనం చేయడమే కాకుండా అకారంగా సినిమా ప్రొడ్యూసర్‌పై దాడి చేసిన సంఘటనలో నలుగురిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం కె.వెంకటనారాయణరెడ్డి మధురానగర్‌లో ఉంటూ నిర్మాతగా సినిమాలు చేస్తుంటాడు. ఆయనను కలవడానికి వచ్చిన ఆదూరి ఉమామహేశ్వర్‌రెడ్డి గతంలో వారు తీసిన ఫిల్మ్ ప్రాజెక్ట్ గురించి మాట్లాడుకున్నారు. అనంతరం కథలు అసంతృప్తి కరంగా ఉన్నందున ఇరువురు విడిగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఈనెల 8న మధ్యాహ్నం ఆదూరి ఉమామహేశ్వర్‌రెడ్డి తన సన్నిహితులైన టి.నవీన్‌కుమార్‌రెడ్డి, సాయి, నవీన్‌రెడ్డి మధురానగర్‌లోని వెంకట నారాయణరెడ్డి కార్యాలయానికి వచ్చి వ్యాపార డేటా దొంగిలించారు. దాంతో వెంకట నారాయణరెడ్డి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

వెంగళరావునగర్: ద్విచక్ర వాహనం మాయమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడ బస్తీకి చెందిన శ్రీనివాసరావు ఈనెల 8న ఇంటి ఎదుట ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఇంట్లోకి వెళ్లారు. ఉదయం చూసేసరికి వాహనం కనిపించలేదు. ఇదే విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. కాగా శ్రీకృష్ణానగర్‌లో నివసించే వై.మల్లేష్ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఈనెల 8వ తేదీనాడు రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని శ్రీకృష్ణనగర్‌లోని తన ఇంటి వద్ద పార్కింగ్ చేసి ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. దీంతో బాధితులు ఇరువురూ ఆదివారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు



పూజల్లో ముత్యాల శేఖర్‌బాబు, సుమలత, లీలావతి

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్‌కు చెందిన సాయిటెక్ పెయింట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత దివంగత ముత్యాల కృష్ణ తన స్వగృహంలోనే గతంలో సాయినాథుడి ఆలయాన్ని నిర్మించారు. టెంపుల్ నిర్మించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన కుమారుడు ముత్యాల శేఖర్ బాబు, సుమలత దంపతులు, లీలావతి ఆదివారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. షిర్డీ నుంచి తెప్పించిన సాయినాథుడు ధరించిన కఫిని వస్త్రం, ఆయన పాదుకలను కళాకారుల బృందాలు, డప్పు వాయిద్యాల నడుమ లంగర్ హౌస్ వీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తుల సందర్శన కోసం ఆలయంలో పెట్టారు. అలాగే అన్నదానం నిర్వహించారు. 3 రోజులుగా కొనసాగుతున్న వేడుకల్లో నగరంతో పాటు వివిధ జిల్లాల నుంచి భక్తులు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పాదుకలు, కఫిని వస్త్రాన్ని దర్శించుకున్నారు.

ముమ్మరంగా పంద్రాగస్టు వేడుకల ఏర్పాట్లు



ఏర్పాటు చేస్తున్న వీఐపీ షెడ్డు

గోల్కొండ: పంద్రాగస్టు వేడుకలకు గోల్కొండ కోట ముస్తాబవుతోంది. ముందుగా సీఎం పతాకావిష్కరణ చేసే వేదికను సిద్ధం చేస్తున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మంత్రులు వీఐపీలు, ఎమ్మెల్యేలు కూర్చునే ప్రాంతాల్లో వాటర్ ప్రూఫ్ షెడ్లను ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు పతాకావిష్కరణ జరిగే పరిసర ప్రాంతాల్లో సెక్యూరిటీ సిబ్బంది మెటల్ డిటెక్టర్లు తదితర వాటితో తనిఖీలు చేస్తున్నారు. గోల్కొండ కోట గోడలపై లైట్లను కూడా అమర్చుతున్నారు. ఆదివారం గోల్కొండ కోటకు వచ్చిన పర్యాటకులు సైతం ఏర్పాట్లను ఆసక్తిగా తిలకించారు.



పతాకావిష్కరణ వేదిక వద్ద..

ఎంజే బ్రిడ్జ్ గోశాల సందర్శన



అఫ్జల్‌గంజ్: ఎంజే బ్రిడ్జ్ గోశాలను గోషామహల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా గోవులకు గడ్డి తినిపించి గోపూజ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు పైడి సంతోష్ నాయుడు, గోషామహల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు భజరంగ్ గోపి, బీఆర్ఎస్ నాయకులు పప్పుమాత్రే, ఎస్ఐ.అరుణోదయ పాల్గొన్నారు.

ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ

చార్మినార్: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా ఈనెల 15న నిర్వహించనున్న అర్బైన్ ర్యాలీ పోస్టర్‌ను కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ర్యాలీ సందర్భంగా తగు ఏర్పాట్లు చేయాలని సంబంధిత ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులకు సూచించారు. అనంతరం మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ మాట్లాడుతూ.. ఈనెల 15న కోట్ల అలీజా నుంచి దారుషిఫా వరకు ర్యాలీ నిర్వహిస్తామని పోలీసు బందోబస్తుతో పాటు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి